ఆర్యవైశ్యుల సమస్యలు పరిష్కరించాలి

ఆల్విన్‌కాలనీ: ఆర్యవైశ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాతను కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు చిరుమర్తి రాజు కోరారు. బుధవారం ఆమెను కలిసి సమస్యలు వివరించారు. కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల పరిధిలోని జగద్గిరిగుట్టలో ఆర్యవైశ్యులు అధికంగా ఉన్నారని, వారిని ఆర్థికంగా ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

వైన్స్ తొలగించాలని ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న నవయువక అసోసియేషన్ సభ్యులు

మూసాపేట: మూసాపేట జనతానగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న శ్రీకృష్ణవైన్స్‌ను తొలగించాలని నవయువక యూత్ అసోసియేషన్ సభ్యులు బాలానగర్ ఎక్సైజ్ అధికారులకు బుధవారం ఫిర్యాదు చేశారు. వైన్స్ పర్మిషన్ ఒక ఇంటి నెంబర్ మీద తీసుకొని దానికి ఆనుకొని ఉన్న నివాసయోగ్యమైన ఇంటిలో అదనంగా పర్మిట్ రూం నిర్వహిస్తున్నారని తెలిపారు. మందుబాబులు మద్యం మత్తులో స్థానికంగా ఉండే మహిళలను అసభ్యకరమైన పదజాలంతో దూషిస్తున్నారని తెలిపారు. నివాస స్థలాల వద్ద బహిరంగ మూత్ర విసర్జన చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో తూము నర్సింగ్‌రావు, శ్రీనివాస్, రాము తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వీసీకి వినతి



వీసీకి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి నాయకులు

కేపీహెచ్‌బీకాలనీ: సమస్యలు పరిష్కరించాలని జేఎన్‌టీయూహెచ్ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డికి జేఎన్‌టీయూహెచ్ ప్రొటెక్షన్ ఫోర్స్ నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రొటెక్షన్ ఫోర్స్ నాయకుడు రాహుల్ నాయక్ మాట్లాడుతూ.. విశ్వ విద్యాలయంలో చాలా రోజులుగా పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ప్రధాన ద్వారం ఎదురుగా రోడ్డు దాటే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని, ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా మంచినీటి సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు అరవింద్ కుమార్, రోహిత్ రెడ్డి, దుర్గాప్రసాద్, ధనుంజయ్, హేమంత్, ఆనంద్, రిత్విక్, గౌతమ్, జవ్వాజి దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు అయ్యప్ప స్వాములు

మోతీనగర్: మోతీనగర్ నుంచి 36 మంది అయ్యప్ప స్వాములు శ్రీనివాస్ గురుస్వామి ఆశీస్సులతో శబరిమలకు బుధవారం బయలుదేరారు. ప్రతి సంవత్సరం భక్తులు ఈ ఆధ్యాత్మిక యాత్రలో పాల్గొని అయ్యప్ప స్వామిని దర్శించుకుంటారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



మాట్లాడుతున్న సీఐ నర్సింహరాజు

బాలానగర్: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు దోహదపడతాయని, ప్రార్థనా మందిరాల్లో తప్పనిసరిగా వాటిని ఏర్పాటు చేసుకోవాలని సీఐ నర్సింహరాజు అన్నారు. బుధవారం బాలానగర్ డివిజన్ పరిధిలోని 120 డివిజన్ పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజ భద్రతలో భాగంగా ప్రతి చర్చి వారు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇందుకోసం కావలసిన సాంకేతిక సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఎన్.వి. రత్నం, బాలానగర్ పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు స్వామి, పాస్టర్లు బి. శాంసన్, ఓఎంకే రాజు, జెర్రమయ్య, కె. ప్రసాద్, కె. రాజు, కృప రావు, సుందర్, సందీప్, అలెక్స్, జయప్రసాద్, ఎం. రాజు, విజయరాజు, వై.జి. కిషోర్ పాల్గొన్నారు.

నివాళి

ఆల్విన్‌కాలనీ: మాజీ కౌన్సిలర్, కీర్తి శేషులు కుర్మయ్యగారి దేవేందర్‌రావు 10వ వర్ధంతి సందర్భంగా బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేశ్వరరావు కూకట్‌పల్లి కేడీఆర్ సర్కిల్ వద్ద ఉన్న దేవేందర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సుదర్శన్‌రావు, కృష్ణారావు, సంజీవరావు, రాజశేఖర్‌రావు, ఆనంద్‌రావు, దుర్గా ప్రసాద్‌రావు, సురేష్‌రావు, దేవేందర్ మిత్రమండలి సభ్యులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

పన్ను వసూళ్లపై స్పెషల్ ఫోకస్

- పట్టణాలు, గ్రామాల్లో పేరుకుపోయిన పాత బకాయిలు
- ఈ ఆర్థిక సంవత్సరంలో వసూళ్ల లక్ష్యం రూ.182 కోట్లు
- వసూలైన పన్ను శాతం 54.80
- స్పెషల్ డ్రైవ్‌తో రంగంలోకి ప్రత్యేక బృందాలు
- వందశాతం వసూళ్లే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని పట్టణాలు (పురపాలికలు), గ్రామ పంచాయతీ (జీపీ)ల్లో పాత బకాయిలతో పాటు వంద శాతం పన్నుల వసూళ్లపై అధికార యంత్రాంగం దృష్టిసారిస్తోంది. వచ్చే మార్చితో 2024–25 ఆర్థిక సంవత్సరం ముగియనుండటంతో లక్ష్యాన్ని అధిగమించేలా పురపాలక సంఘాలు, జీపీలు స్పెషల్ డ్రైవ్‌కు సిద్ధమవుతున్నాయి. వీరిని రంగంలోకి దింపటం ద్వారా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ఇంటింటికీ వెళ్లి పన్నులు వసూలు చేయాలని భావిస్తుంది. ఇంకా మూడు నెలలు మాత్రమే గడువు ఉండటంతో స్పెషల్ డ్రైవ్ చేపట్టేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. పట్టణాలు, జీపీల్లో పన్నుల వసూళ్లను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. లేని పక్షంలో పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి కుంటుపడగలదని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పన్ను వసూళ్ల లక్ష్యం చేరుకునేందుకు శతవిధాలా ప్రయత్నించాలని భావిస్తోంది.

పట్టణాలు.. జీపీల్లో పన్నుల లక్ష్యం రూ.182 కోట్లు

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలోని 13 పురపాలక సంఘాలతోపాటు 34 గ్రామ పంచాయతీల్లో వివిధ రకాల పన్నుల వసూళ్ల లక్ష్యం రూ.182 కోట్లు (పురపాలక సంఘాల్లో రూ.172 కోట్లు, జీపీల్లో రూ.10.76 కోట్లు) కాగా, ఇప్పటి వరకు 54.80 శాతం పన్నుల వసూళ్లు చేశారు. వచ్చే మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో.. అప్పటి వరకు వంద శాతం పన్నుల వసూళ్ల కోసం స్పెషల్ డ్రైవ్‌కు అధికార యంత్రాంగం మొగ్గు చూపుతోంది. మార్చి 31 వరకు పన్ను చెల్లించిన వారికి వడ్డీ మినహాయింపు ఇవ్వగా, ఆ తర్వాత చెల్లించిన వారికి 2 శాతం చొప్పున పన్నుపై వడ్డీ విధిస్తారు. పట్టణాలు, జీపీల్లో ప్రైవేట్ ఆస్తుల పన్నులు సకాలంలో వసూలవుతున్నా.. ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన పన్నులు మాత్రం ఏటా పెరిగిపోతున్నాయి.

పేరుకుపోయిన బకాయిలతో కష్టాలు..

పట్టణాలు, గ్రామ పంచాయతీల్లో ప్రతి ఏటా సకాలంలో పన్నులు వసూలు కావటం లేదు. రూ. కోట్లల్లో బకాయిలు పేరుకుపోతుండటంతో అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకం కలుగుతోంది. దీనికి తోడు పురపాలక సంఘాలు, జీపీల్లో పని చేస్తున్న సిబ్బంది జీతభత్యాలు కూడా సకాలంలో చెల్లించలేని దుస్థితి ఏర్పడింది. ఇలాంటి పరిస్థితి నుంచి పట్టణాలు, జీపీలు బయటపడాలంటే పన్నులు సకాలంలో వసూలు కావాల్సిన అవసరం ఉంది.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ

ఆల్విన్‌కాలనీ: సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర నగర్ కాలనీకి చెందిన పానుగొంటి నర్సింహారావుకు మంజూరైన రూ. 33 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బుధవారం బాధిత కుటుంబ సభ్యుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థిక భరోసా ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఇంద్రహిల్స్, రాంకిపెరల్ మధ్యలో ఉన్న నాలా వద్ద చెత్త పేరుకుపోయి దోమల సమస్య ఎక్కువగా ఉందని స్థానికులు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన బుధవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు కూడా తమవంతు బాధ్యత వహించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వారానికి ఒక్కసారైనా ఇంటిని, ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకోవాలన్నారు. నీటి నిల్వలు లేకుండా తొలగించాలన్నారు. చెత్తాచెదారాన్ని కాలువలు, చెరువుల్లో వేయకుండా ఉదయం వచ్చే ఆటో రిక్షా కార్మికుడికి అందజేయాలన్నారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్‌గౌడ్, పోశెట్టి గౌడ్, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



నాలా వద్ద చెత్తాచెదారాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ తదితరులు

ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మంటలు

ఉలిక్కిపడ్డ స్థానికులు



మోతీనగర్: అకస్మాత్తుగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి బుధవారం మంటలు భారీగా ఎగిసిపడటంతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడి బెంబేలెత్తారు. ఏమి జరిగిందోనని ఆందోళనకు గురయ్యారు. మూసాపేట డివిజన్ పాండురంగానగర్ దేవాలయం సమీపంలో సాయంత్రం 7.30 గంటల ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్‌లో ఒక్కసారిగా మంటలు వచ్చాయి. సమీప నివాసితులు ఇళ్లల్లోంచి బయటకు వచ్చి ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందజేశారు. వారు వచ్చే లోగా మంటలు ఆరిపోయాయి. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయమై ఎర్రగడ్డ సెక్టార్ ఏఈ మానసను వివరణ కోరగా.. విచారణ చేపట్టి ఏ విధంగా మంటలు వచ్చాయో శాఖాపరంగా తెలుసుకుంటామని తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీస్ అధికారులు ఆ ప్రాంతానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు.

కాంగ్రెస్ అభివృద్ధికి యువత కృషి చేయాలి



బండి రమేష్‌తో యూత్ కాంగ్రెస్ నాయకులు

బాలానగర్: కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి యూత్ కాంగ్రెస్ నాయకులు నిరంతరం కృషి చేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా గెలిచిన బొమ్మక అజయ్, నియోజకవర్గ అధ్యక్షుడు ఎండీ సలీం, జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎండీ ఆరిఫ్, బాలాజీనగర్ ప్రెసిడెంట్ ఎండీ సుల్తాన్, కూకట్‌పల్లి డివిజన్ వైస్ ప్రెసిడెంట్ జోగారావు, నియోజకవర్గ జనరల్ సెక్రటరీ డి. ప్రణీత, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ యూత్ ప్రెసిడెంట్ రంగస్వామిలు బాలానగర్‌లోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయనను కలిశారు. అతను వారిని సన్మానించి మాట్లాడారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, బాకీ, యూసఫ్, అస్లాం, ఆయాజ్, ప్రవీణ్, నర్సింగ్‌రావు, టోచర్, పర్వేజ్, థామస్ తదితరులు పాల్గొన్నారు.

హుడా పార్కు@వాహనాల పార్కింగ్





ఆస్‌బెస్టాస్ కాలనీ హుడా పార్కులో వాహనాల పార్కింగ్

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని ఆస్‌బెస్టాస్ కాలనీ హుడా పార్కు వాహనాల పార్కింగ్, అసాంఘిక శక్తులకు అడ్డాగా మారుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. హుడా పార్కులో గతంలో షటిల్ కోర్టు ఏర్పాటు చేశారు. కోచ్ లేకపోవటంతో ఉదయం వేళల్లో స్థానికంగా ఉన్న పాఠశాల విద్యార్థులు ప్రార్థన చేసుకోవటం, సాయంత్రం స్థానికులు ఆడుకోవటానికి ఉపయోగపడేది. షటిల్‌కోర్టులో కోచ్ లేకపోవటంతో ఆ షటిల్ కోర్టులోని పరికరాలు కనుమరుగయ్యాయి. పోకిరీలకు ఆవాసంగా మారింది. దాని పక్కనే ఉన్న మరో పార్కు స్థలం ఖాళీగా ఉండటంతో స్థానికులు కార్లు, డీసీఎంలు పార్కు చేసుకోవటంతో మందుబాబులకు అడ్డాగా మారుతోంది. రాత్రి 12 వరకు మందుబాబులు తిష్టవేసి గొడవలకు దిగుతున్నారని స్థానికులు వాపోయారు. సుమారు 4 ఎకరాలు స్థలంలో 2 ఎకరాల్లో పార్కు అభివృద్ధి చేశారు. కొంత స్థలంలో షటిల్ కోర్టు ఏర్పాటు చేయగా.. ఉన్న ఖాళీ స్థలం పోకిరీలకు, పార్కింగ్‌కు నెలవైంది. ఇక కొందరు కబ్జాలకు పాల్పడుతున్నారని, అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. పార్కును అభివృద్ధి చేసి ఆహ్లాదకర వాతావరణం కల్పించాలని స్థానికులు, అధికారులు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

చెత్తను తొలగించరా?

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ ఆంజనేయ నగర్ కాలనీలో పాపవినాశనం ఆలయంకు వెళ్లే దారిలో చెత్తా చెదారంతో అపరిశుభ్రంగా ఉంది. ఈ దారి వెంట నిత్యం అయ్యప్ప మాలధారణ భక్తులు, శివ భక్తులు అధిక సంఖ్యలో వస్తూ ఉంటారు. డ్రైనేజీ పొంగి పొర్లుతూ చెత్తా చెదారం పేరుకుపోయి దుర్వాసనతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి చెత్తా, చెదారాన్ని తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



అంగన్‌వాడీలో సామూహిక సీమంతం



ఓల్డ్ బోయిన్‌పల్లి: ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా ఓల్డ్ బోయిన్‌పల్లిలోని హరిజనవాడ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం సామూహిక సీమంతాలు, అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దీప్తి మాట్లాడుతూ.. రెండేళ్లు పైబడిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే ఆహారాన్ని తీసుకోవడం ద్వారా పౌష్టిక విలువలు లభిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో యూసీడీ సీఓ మహిపాల్‌రెడ్డి, ఏఎన్‌ఎం స్వరూప, పద్మ, దివ్య, దేవేందరమ్మ, ఐసీడీఎస్ సూపర్ వైజర్ స్వరూప, ధనలక్ష్మి, స్వప్న, సునిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

- కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు





ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాసరావు తదితరులు, మెట్రో మాల్‌లో సిబ్బందితో ఏసీపీ తదితరులు

మూసాపేట: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం కూకట్‌పల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు, కూకట్‌పల్లి మెట్రో మాల్‌లో సిబ్బందికి సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలం మారుతున్నట్లుగా దొంగలు కూడా నూతన పద్ధతులను అనుసరిస్తున్నారని, సైబర్‌నెట్ పెరుగుతుండటంతో దొంగలు కూడా దానిని ఆసరాగా తీసుకొని కొత్త పద్ధతుల్లో దొంగతనాలు చేస్తున్నారని తెలిపారు. పెద్ద ఫోన్, ఇంటర్‌నెట్ ఉన్నంత మాత్రాన అన్ని లింకులను ఓపెన్ చేయవద్దని, లింకులు పంపించి అకౌంట్‌లోని డబ్బులను మనకు తెలియకుండానే కాజేస్తున్నారని వివరించారు. మీకు లోన్ వచ్చిందని, గిఫ్టులు వచ్చాయని, టూర్ ప్యాకేజీలు తక్కువ ధరకు వచ్చాయని లింకులు పంపిస్తే వాటిని ఓపెన్ చేయకూడదని సూచించారు. పండుగ దసరా, సంక్రాంతి ఆఫర్లు అంటూ మనకు టోకరా పెడుతున్నారని తెలిపారు. బ్యాంకుల నుంచి ఫోన్‌లు చేసి ఓటీపీ ఎవరూ అడగరని అన్నారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి సీఐ ముత్తు, ఎస్‌ఐలు, సైబర్ టీం, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆటోలో కార్మికుడి యూనిఫాంలో అసెంబ్లీకి వెళ్తున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు - కూకట్‌పల్లి

లీకేజీలతో తాగునీరు వృథా

- రోడ్లపై పారుతున్నా మరమ్మతులు అంతంతే
- ఇబ్బందులు పడుతున్న పాదచారులు, వాహనదారులు

మోతీనగర్: కొన్ని ప్రాంతాల్లో లో ప్రెషర్ వల్ల సరిపడు నీరు సరఫరా కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు కొన్ని ప్రాంతాల్లో నీటి వృథా కావడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూసాపేట డివిజన్, మోతీనగర్ ప్రధాన రోడ్డులో బోరబండ వైపు సరఫరా అయ్యే ప్రధాన వాటర్ పైపులైన్ లీకేజీతో నీరు ఓ వ్యాపార సముదాయంలోకి వెళ్తున్నాయి. వాటిని ఆ భవన యజమాని పైపు ద్వారా రోడ్డు పైకి వేయటంతో మోతీనగర్ ప్రధాన రోడ్డు మీదుగా మీ సేవా వైపు తాగునీరు గ్యాలన్ల కొద్దీ వృథాగా పోతున్నాయి. అంతేగాకుండా రోడ్డు సైతం బురదమయంగా తయారైంది. లీకేజీ అవుతున్న ప్రాంతం ఎర్రగడ్డ జలమండలి పరిధిలోకి వస్తుంది. అయినప్పటికీ మూసాపేట సర్కిల్ మండల సిబ్బంది.. ఇంటి యజమానికి రోడ్డుపైకి వదలకుండా చర్యలు చేపట్టాలని చెప్పినా వినిపించుకోవటం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి లీక్ అవుతున్న వాటర్ పైపులైన్ ప్రధాన పైపుకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



నీటిని రోడ్డుపైకి వదలడంతో బురదమయమైన రోడ్డు



మోతీనగర్‌లోని మీ సేవా వైపు రోడ్డుపై పారుతున్న తాగునీరు



ప్రధాన రోడ్డులో పైపు ద్వారా రోడ్డుపైకి నీటిని వదిలే ప్రాంతం



సెల్లార్‌లోకి ప్రవేశించిన మంచినీటిని ప్రధాన రోడ్డుపైకి వదులుతున్న ఇంటి యజమాని

అధికారులకు సమాచారం ఇచ్చాం

లీకేజీ అవుతున్న ప్రాంతం ఎర్రగడ్డ పరిధిలోకి వచ్చినప్పటికీ తాము తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టాము. సమాచారాన్ని ఎర్రగడ్డ జలమండలి మేనేజర్‌కు సైతం తెలియజేశాం. అవసరమైతే తాము కూడా లీకేజీలను అరికట్టడానికి తమ వంతు సహకారం అందిస్తాం

– విలియం ప్రకాష్, మూసాపేట జలమండలి సెక్షన్ మేనేజర్.

డివైడర్ పనుల పరిశీలన

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వివేకానందనగర్ కాలనీ కమాన్ నుంచి చేపడుతున్న రోడ్డు డివైడర్ పనులను ట్రాఫిక్ సీఐ ముత్తుయాదవ్‌తో కలిసి పీఏసీ చైర్మన్ గాంధీ మంగళవారం రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలన్నారు. డివైడర్ ఏర్పాటు ద్వారా వాహనదారులకు, విద్యార్థులకు, ప్రజలకు ఉపశమనం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ గురువా రెడ్డి, నాయకులు సైదేశ్వర్, శర్మ, మల్లయ్య, నరేందర్, శ్రీనివాస్, కాలనీ వాసులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ తదితరులు